కళాశాల విద్యార్థుల చిన్న చిన్న కథల పోటీలో రెండవ బహుమతి పొందిన కథ

# తిరుగుబాటుకు బలి

బండి మెల్ల మెల్లగా కదుల్తుంది.

ఎడ్లు దమ్ము తీసుకుంటూ నడుస్తున్నాయి.

కాలం వేగంగా పురుకతున్నట్టు, బండి మెల్లగా కదులుతున్నట్లు అనిపించింది రామానాయుడికి.

"అరేయి నర్సిగా—ఎడ్ల గెదుము జర జల్దిన పోనీయ్ బండి, ఏమాయెరా నిద్రబోతున్నావురా, గాడిద కొడుక, గెదుమురా గెదుము" దొర మాటల్లో తీవ్రత, ఆతృత, ఆవేదన.

లంకెమొద్దు తెంపబడ్డట్లుగా పరుగు లంకించుకున్నాయి ఎడ్లు.

ఆ వూరికి మకుటంలేని మహారాజు రామానాయుడంటె.

అతడి దగ్గర గల పాతికమంది జీతగాళ్ళలో నర్సిగాడు ఒకడు.

డబ్బు లేకున్నా కులం కున్న తాహతు నర్సయ్యను బండెక్కించ గలిగింది.

హఠాత్తుగా రామానాయుడి కొడుక్కి జ్వరం ముంచుకొచ్చింది. ఆ వూళ్ళో దవాఖాన వుంది. పేరుకి డాక్టరూ వున్నాడు. కాని డాక్టరు దర్శనమిచ్చే రోజులకంటె హాస్పిటల్ రిజిష్టర్‌లో అతగాడి హాజరు మూణ్నాల్గు రెట్లు అన్న సంగతి అందరికి తెలుసు అయినా ఎవడూ నోరెత్తడానికి వీలులేదు. కారణం దొరకి డాక్టరుకి లాలూచీలున్నాయని వదంతి.

కొడుకు తలను ముట్టిచూసిన దొరకు శరీరం పేలిపోతున్నట్లుగా అనిపించింది. "అబ్బా పెయ్యి పెనంలా కాలిపోతుందే" అన్నాడు దొరసానితో.

డాక్టరు వూళ్ళో సమయానికి లేకపోవడం ఎంత పెద్ద దెబ్బో ఇప్పుడర్థమైంది అతడికి. కంపౌండరు తన చేతగానితనాన్ని బయట పెట్టడంతో డాక్టరును వెతుక్కుంటూ పట్నం దారి పట్టక తప్పలేదు. డాక్టరు విషయంలో అతడు చేసిన తప్పేమిటో ఈరోజు అర్థమైంది. అయ్యాల నర్సిగాడి పెళ్ళాం సచ్చిపోయినంక వాడెంత చెప్పుకున్నాడు తనకు.

తెగ విచారిస్తున్న దొరకు బండి వేగం తగ్గినట్టనిపించింది. డాక్టరుపై కోపం, తనపై తనకే ఏర్పడిన అసహ్యమంతా నర్సిగానిపై చూపించి గెదమడం నర్సిగాడు ఎడ్లను అదిలించడం ఒకేసారి జరిగిపోయినాయి.

బండి పరుగెత్తుతుంది.

బండి ముందర దౌడు తీస్తున్న మస్కూరోడు తెగ రొప్పుతున్నాడు.

బండిలోని విషాదం, దొర దొరసానితో చెప్పే మాటలు అన్ని వింటున్న నర్సిగాని ఆలోచనలకు పచ్చజెండా ఊపినట్లయింది.

ఆలోచనల్లో పడ్డ నర్సిగాడు పగ్గాల్ని అదిలించడం మానేసాడు. ఒక్కసారిగా ఎడ్లు, మస్కూరోడు ప్రాణం లేని బండి ఊపిరి పీల్చుకున్నాయి

అదే

ఆ రోజు ఆ రోజు

ఇదే దొర

దొర గెదమడంతోబాటు అట్లను జారవిడిచాడు.


శరీరానికి మెదడుకు సంబంధం తెగిపోయింది.

* * *

ఆర్నెల్ల క్రితం

ఎండలు తీవ్రంగా మండుతున్నాయి ఆ ఏడాదికి కాలం పోయినట్లుగానే భావించారంతా.

రోళ్ళూ, రోకండ్లూ పగలతమేమో కాని భూములు బీటలు పారడం, ఊళ్ళో జ్వరాలు ప్రారంభమయినాయి.



ఆ రోజు తను గుడిసెకు చేరగానే తన పెళ్ళాం "మల్లి" మూల్గులు వినిపించాయి.

దగ్గరకెళ్ళి చూసిన నర్సిగాడికి పెళ్ళాం జ్వరంతో కన్పించింది.

అయ్యా మాటలు వినబడగానే గుడిసెకు చేరింది వాడి కూతురు లచ్చిమి.

వారం రోజులుగా దవఖానకు వెళ్ళడం, కంపౌండర్ యిచ్చిన గోళీలు, రంగునీళ్ళు తెచ్చి తాగించడం జరుగుతూనే వుంది.

అయినా జ్వరం జారుకోలేదు!

వాడు సంపాదించే జీతపు గింజలు, వాడి పెళ్ళాంకు వచ్చే కూలిరాళ్ళు తిండికి సరిపోగా మిగిలిందేదయినా వుంటే ఈ వారం రోజుల్లో కరిగిపోయింది.

కంపౌండర్ని గట్టిగా అడిగితే ఇంత కాలం తనకు చేతనయింది చేశాను, పట్నం కెళ్ళి సూది మందులు తెచ్చుకోమనీ, పుణ్యాని కొచ్చిన మందులతోని రోగం తక్కువ కమ్మంటే అయితాదీ అన్నాడు.

"పట్నంకెళ్ళి మందు తెచ్చుకోవడమంటే మాటలా?"

పది రూపాయలన్నా గావాలె పది రూపాయలేమోగాని పది పైసలన్నా పుట్టించ లేడే తను.

ఏం చేయాలి?

ఏం చేయాలి ?

చేయాలి చేయాలి.

ఊళ్ళో ఎవడికయినా అప్పు పుట్టించా లంటె ఉన్న ఒక్క ఆశ రామానాయుడు దొరే.

"ఆ దొర దగ్గర బాకీ తీసుకోవస్తే తను ఇట్లా అయ్యిండు, అయినా తప్పదు మరి" అనుకున్నాడు.

* * *

ఇంటి ముందర వరండాలో కూర్చొని పొగ పీలుస్తున్నాడు దొర.

"అయ్యా" అన్న నర్సిగాడి పిలుపు.

పొగ పొగ పొగ, నర్సిగాడి మొఖం మీదనుండే పోతుంది.

"ఎందిరా? ఏమయ్యింది?"

"దొరా నీ కాల్మొక్త దొరా నా పెళ్ళాం చావు బతుకుల్లో వుంది దొరా, జెరంతోని గొట్టుక స్తుంది. ఇక నివ్వే దిక్కు దొరా. పది రూపాయలు అప్పియ్యి దొరా బతికుంటే నేనూ అది ఇద్దరం ఏ పనన్నా జేసి జేసి తీరుస్తాం దొరా.

"మన కంపౌండరు దొరకు సూపిస్తే పట్నంపోయి మందులు తీసుకరమ్మన్నడు

దొర!"

"ఇగ నీవే దిక్కు దొర."

"ఆఁ ఏందిరా

"నీకు బాకీ ఇయ్యమంటవు.

"ఇంతకు ముందున్న బాకీ తీర్చినావురా? మళ్ళీ ఇయ్యమంటవింకా?"

"దయ దొరా చచ్చి నీ కడుపున పుడ్త.

"మరి మొన్నటి పైకం ఏం జేసినవురా?

"అ అప్పెప్పుడు తీరుస్తవు — మళ్ళీ ఇయ్యాల కొత్తగా కావాలంటున్నావురా!

"గిదేరా గిదే ఒక్కసారి యిత్తే ఎప్పటికీ అడుగుతార్రా — అడిగేటోడికి ఇచ్చేటోడు లోకువైతడట."

"జెర్ర కనికరించండ్రి దొరా."

"కులపోనివని కనికరం జూపిత్తెనేగదరా ఆ అప్పు అట్లనే ఏడ్తంది."

"జీవితాంతం మీదగ్గర పడుంటం దొరా "

నర్సిగాడి మాటల్లో ఆతృత ఒకటే ఆతృత పెళ్ళాన్ని బతికించుకోవాలన్నదే కోరిక.

ఇంకోసారి "దొరా" అని కాళ్ళపైబడ్డాడు.

బండలాంటి దొర గుండెలో ఎక్కడో ఒక చోట నీటి బిందువు మెరిసింది.

"అరేయ్ నర్సిగా లే లేరా.

"పైక మెంత గావల్రా?"

"పట్నంపోయి మందు తేవల్దొరా."

"అదే అదేరా ఎంతఇయ్యమంటవు?"

"సరే ఇస్తాగాని

సాయి దగ్గరకెళ్ళి నీళ్ళు కట్రాపో "

వేగం ఒకటే వేగం.

"అయ్యా "

"కట్టొచ్చిన బాంచను."

"ఇగోరా యీ పది రూపాయలు తీస్కో."

పరుగుతో నడక ఒకటే పరుగు.

* * *

"అయ్యా అయ్యా" అంటూ ఎగబోస్తూ ఎదురుగా వచ్చిన కూతుర్ని చూడగానే గుండె ఝల్లుమంది నర్సిగాడికి.

రాజయ్యా—"నీ పెళ్ళాం చచ్చిందిరా నర్సీ " అన్న మాటలు చెవిన పడ్డంతోనే గుడిసెకు పరిగెత్తాడు.

పట్నం నుంచి తెచ్చిన మందులు మధ్యలోనే జారిపొయ్యాయి.

అప్పటికే చుట్టుపక్కలవారంతా గుడిసె ముందు పోగైనారు. నర్సిగాడ్ని చూడ్డంతోనే శవం చుట్టూ గుమిగూడిన జనం పక్కకు జరిగారు. చచ్చిన పెళ్ళాన్ని చూడగానే గొల్లుమన్నాడు.

నిజంగా అది ఏడుపు కాదు.

గుండెను అరగదీసి కార్చిన కన్నీళ్ళు ఎంత ప్రాణంగా చూసుకునేవాడు తన పెళ్లాన్ని. కట్టుకున్నప్పట్నించి ఒక్కనాడయినా కొట్టాడా తన మల్లిని. ఈనాడు తనను విడిచి ఏకంగా వెళ్ళింది. తన్నే కలువరిస్తూ పోయిందట. ఆఖరికి దేవుడి కూడ కండ్లు కుట్టినయో ఏమో—తమ ముచ్చటైన జోడి చూడలేక తీస్కపోయాడు.

ఏడ్పులు ఏడ్పులు

ఏడ్పుల మధ్య బాధగా భావాలు వెలికి వస్తున్నాయి. నర్సిగాడి ప్రసక్తి లేకుండానే శవం పాడెపై చేరింది.

* * *

గతం కళ్ళముందు సినిమా రీల్లా గిర్రున తిరుగుతూంటే స్పృహ తప్పుతున్నట్లుగా, కళ్ళముందంతా తెల్లగా శూన్యంగా దర్శనమిస్తోంది. జారుతున్న కన్నీళ్ళని తువ్వాల్లాంటి పై పంచతో అద్దుకున్నాడు.

బాటపై పడుతున్న ఎండంతా వాడి కళ్ళల్లో చిత్తబడ్డట్లు, కంకర రాళ్ళపై కదులుతున్న బండి వాగిలోని ఆవేశాన్నంతా కుదుపుతనట్లయ్యింది.

తన పెండ్లాం మల్లి చావుకి వీడే వీడే.

మధ్య మధ్య దొర గెదుముడుకు ఒక్కసారి పగ్గాల్ని అదిలించడం—బండి రోడ్డు పక్కగా వున్న బండ ఎక్కి, గుండలోకి దొర్లిపోవడం ఒకేసారి జరిగిపోయినాయి. □

కె. వెంకటేశ్వర్ బి. కాం.
(ద్వితీయ) నగరంగల్